క్లుప్తంగా

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

తాగునీటి సమస్య పరిష్కారం


మోటారు అమర్చుతున్న సర్పంచ్ లిల్లీ ఆనందన్

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం దళితవాడలో తాగునీటి సమస్యను సర్పంచ్ లిల్లీఆనందన్ పరిష్కరించారు. గ్రామంలో చాలా రోజులుగా తాగునీటి సమస్య ఉందని తెలపడంతో శుక్రవారం సర్పంచ్ లిల్లీ, పంచాయతీ కార్యదర్శి సుధ చేతిపంపునకు మోటారు అమర్చారు. దీంతో సమస్య పరిష్కారమైంది. ప్రజలకు తాగునీరు సరఫరా అయింది.

నిర్మలమ్మకు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ


నిర్మలమ్మను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండలంలోని ముక్కరవానిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రేమనాథరెడ్డి భార్య నిర్మలమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి ఉచిత వైద్యాన్ని అందించారని గుర్తు చేశారు. నేడు అధికారం కోసం వెంపర్లాడుతూ గుంపుగా వచ్చిన చంద్రబాబు వైఎస్సార్ ఆరోగ్యశ్రీని కనుమరుగు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.

పెద్ద బుడ్డయ్య మృతికి నివాళి


బుడ్డయ్యకు నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: మండలంలోని డీఎం పురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు పెద్ద బుడ్డయ్య(70) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీడీ నెల్లూరు వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి కళత్తూరు కృపాలక్ష్మి ఆ గ్రామానికి వెళ్లి బుడ్డయ్య మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట మాజీ ఎంపీటీసీ వెంకటరత్నం, రవి, గాంధీ, శివయ్య, దాము తదితరులు ఉన్నారు.

అమ్మవారి హుండీ చోరీ


పగిలిన ఇంటి తలుపులు

శ్రీరంగరాజపురం : మండలంలోని శ్రీఆరిమానిగంగమ్మ ఆలయంలోని హుండీని గురువారం రాత్రి దుండగులు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ ఆలయంలోకి గురువారం రాత్రి ఇద్దరు ముసుగు దొంగలు చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. దాన్ని పొలంలో పగులగొట్టి అందులోని కానుకలను అపహరించారు. అనంతరం దుండగులు ఒడ్డుపల్లిలో ఒక టీచర్ ఇంటిలో చోరీకి ప్రయత్నించారు. వారు కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లకిలో సత్యసాయి


పల్లకిలో ఊరేగుతున్న సాయి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సత్యసాయి జయంతిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా మందిరం ఆధ్వర్యంలో సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. తొలుత మందిరంలో వేద పఠనం చేశారు. అనంతరం పల్లకిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. భజన, మంగళ హారతి మధ్య ఈ ఊరేగింపు సాగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బడి వంట.. ధరల మంట


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకులు


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- భారంగా మధ్యాహ్న భోజనం
- మండుతున్న నిత్యావసరాల ధరలు
- నాలుగు నెలలుగా అందని గౌరవ వేతనం

పాలసముద్రం: విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర ధరలు పెరుగుదల శరాఘాతంగా మారింది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టు ప్రభుత్వం బడ్జెట్ పెంచడం లేదు. దీంతో విద్యార్థులు అదిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోంది. పౌష్టికాహారం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నాలుగు నెలలుగా గౌరవ వేతనం రాలేదు. సామాన్య మధ్య తరగతి ప్రజలతోపాటు పాఠశాలలకు కూడా ధరల మంట తగులుతోంది. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి, మనబడి – నాడు నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చింది. దీంతోపాటు పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందించేది. అప్పట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకే పంపేందుకు ఆసక్తి చూపేవారు. నిత్యావసర ధరలతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులకు వంట భారంగా మారింది. అప్పుచేసి పిల్లలకు భోజనం చేసి పెడుతున్నా బిల్లులు సకాలంలో అందక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. దీంతో రుచికరమైన, నాణ్యమైన భోజనం పిల్లలకు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పాత మెనూ అమలు

ప్రభుత్వం ప్రకటించిన మెనూ మేరకు సోమవారం అన్నం, పప్పుచారు, ఎగ్ కర్రీ, చిక్కి, మంగళవారం పులిహోర, టమాటా పప్పు, గుడ్డు, బుధవారం విజిటబుల్ రైస్, ఆలూ కూర్మా, గుడ్డు, చిక్కి, గురువారం కిచిడీ, పెసరపప్పు, అన్నం, టమాటా చట్నీ, గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కి శనివారం అన్నం సాంబార్, స్వీట్ పొంగల్ పెట్టాలి. ఇందులో ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థికి రూ.5.88, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.57 నిర్వాహకులకు అందిస్తున్నారు. మెనూ బిల్లులు గత ప్రభుత్వంలోనివే ఈ ప్రభుత్వం ఇంకా బిల్లులు పెంచలేదు. కేవలం పాఠశాలల విద్యార్థులకు మాత్రం 44 పైసలు మాత్రమే పెంచింది.

విద్యార్థుల అవస్థలు

నిత్యావసర వస్తువులు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా నిర్వాహకుల ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదు. ఫలితంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గింది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినలేక అవస్థలు పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు నెలలుగా అందని గౌరవేతనం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం అందించేది. కూటమి ప్రభుత్వం సకాలంలో రూ.3 వేలు కూడా ఇవ్వడం లేదు. అది ఇచ్చినా కూడా నిత్యావసర సరుకులకు వాడుకుంటారు. అది కూడా ఇవ్వకపోవడంతో అప్పులపాలై పోతున్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు



నేడు పెరుగుతున్న నిత్యావసర ధరలతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో పిల్లలందరికీ వంట చేయడం భారంగా మారింది. బిల్లులు కూడా సకాలంలో అందక పోవడంతో అవస్థలు పడుతున్నాం. ఇప్పటికీ పాత మెనూ బిల్లులు ఇస్తున్నారు. – మలర్, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

అందని గౌరవేతనం



ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలకు గౌరవేతనం రూ.3 వేలు ఇస్తున్నారు. ప్రస్తుతం నాలుగు నెలలుగా అది కూడా ఇవ్వడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దీనికే సరిపోతుంది. ఇతర పనులకు వెళ్లే పరిస్థితులు కూడా లేవు. కనీసం వేతనమైనా సక్రమంగా ఇవ్వాలి. – విజిత, మధ్యాహ్న భోజన, నిర్వాహకురాలు

త్వరలో మెనూలో మార్పులు



ప్రస్తుతం మధ్యాహ్న భోజనం పథకంలో ఉన్న మెనూతోపాటు ధరల్లో కూడా ప్రభుత్వం త్వరలో మార్పులు చేస్తున్నట్లు మాకు సమాచారం ఉంది. మండలంలోని అన్ని పాఠశాలల్లోను మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించేలా ఏజెన్సీలకు సూచించాం. – రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, పాలసముద్రం

నేడు మహాకాళ రక్షక యాగం

నగరి: పట్టణంలోని కామాక్షి సమేత కరకంటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కాలభైరవ స్వామి సన్నిధిలో మహాకాళ రక్షక యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మహాకాళ రక్షక యాగం, 10.30 గంటలకు ప్రత్యేక అభిషేక పూజ నిర్వహిస్తామని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: వి.వి.పురం పంచాయతీ అంకనపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ధనుంజయులు(54) గురువారం రాత్రి గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయనతోపాటు మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత జనార్దన్, సర్పంచ్ లక్ష్మమ్మ, నాయకులు దామునాయుడు, శేషాద్రి, దిశంబర్‌శెట్టి, దాము ఆచారి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోసంరక్షణకు రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ది వినాయక స్వామి దేవస్థానంలోని గోసంరక్షణ ట్రస్టుకు శుక్రవారం ఓ దాత రూ.1 లక్ష విరాళం చేశారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రసాద్ గోసంరక్షణ ట్రస్టుకు రూ. ఒక లక్ష నగదును విరాళంగా అందించారు. ఆ నగదును అందుకున్న ఆలయ సిబ్బంది వారికి దైవ దర్శనం కల్పించారు. అనంతరం పండితులు ఆశీర్వచనంతోపాటు తీర్థప్రసాదం అందజేశారు.

శుభ్రతతోనే పైలేరియా నివారణ


రక్త సేకరణను పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: దోమ కాటు ద్వారా పైలేరియా వ్యాధి వాప్తి చెందుతుందని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ అన్నారు. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. జాతీయ బోధకాలు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వెదురుకుప్పం, చవటగుంట గ్రామాల్లో రాత్రి పూట రక్త పూతల సేకరణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే పైలేరియా(బోదకాలు), సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని పేర్కొన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. వృథా నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనంతరం 515 మంది ద్వారా రక్త పూతల సేకరణ చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, పుత్తూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు, ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంట భూమి స్వాహా


దిగువ ఇప్పకుంట కట్టపై అక్రమ ఇంటి నిర్మాణం

- ప్లాట్లు వేసి తెగనమ్మి లక్షలు ఆర్జించిన టీడీపీ నాయకులు
- కేజీఆర్‌పురం ఇప్పకుంట కట్టపై 15 అక్రమ ఇళ్ల నిర్మాణాలు
- గ్రామానికి చెందిన టీడీపీ నాయకులదే పాపం
- 2014–19 టీడీపీ పాలనలో సాగిన అవినీతి తంతు

పుత్తూరు: 2014–19 నాటి తెలుగుదేశం పాలనలో కనబడ్డ కుంటలను, పంట కాల్వలను, చెరువులను, ప్రభుత్వ భూములను ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులే కబ్జా చేసి. తెగనమ్ముకొని లక్షలు ఆర్జించారు. అలా టీడీపీ నాయకుల స్వాహా పర్వంలో దాదాపు కనుమరుగైనదే దిగువ ఇప్పకుంట. పుత్తూరు మండలం కేబీఆర్‌పురం గ్రామంలోని సర్వే నెంబర్ 128/2లో 2.08 ఎకరాల విస్తీర్ణంలో దిగువ ఇప్పకుంట ఉంది. గ్రామానికి ఆనుకుని ఉండే ఈ కుంట కట్ట నేడు పూర్తిగా అక్రమ ఇళ్ల నిర్మాణాలతో నిండి పోయింది. ఇలా ఇళ్లు నిర్మించడానికి అదే గ్రామానికి చెందిన ఇద్దరు పేరుమోసిన టీడీపీ నాయకులే కారణం. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ఇష్టారాజ్యంగా సాగించిన ఆక్రమణల పర్వానికి అంతేలేదు. కుంట కట్టపై ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టారు. అలా ఒకరి చేతి నుంచి మరొకరు అంటూ చేతులు మారాయి. ప్రస్తుతం కట్టపై 15 పక్కా అక్రమ ఇళ్ల నిర్మాణాలు వెలిశాయి. కుంటలు, చెరువుల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే సుప్రీం కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నా, వాటిని అమలు చేయడంలో స్థానిక రెవెన్యూ శాఖ పూర్తిగా విఫలమైంది. ఒక్క కేబీఆర్‌పురంలోని దిగువ ఇప్పకుంట ఒక్కటే కాదు మండల పరిధిలోని పలు కుంటలు, ఒరవ కాలవ్వలు, చెరువు భూముల్లో సైతం ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. అయినా పట్టించుకునే అధికారే లేడంటే అతిశయోక్తి కాదు.

పాపం పాడిరైతులు

వర్షాకాలంలో దిగువ ఇప్పకుంట నీటితో కళకళలాడేది. గ్రామంలోని పాడి రైతులు ఈ కుంటలోనే తమ పశువులకు నీళ్లు తాగించడం, శుభ్రపరుచుకోవడం చేసేవారు. ఈ కుంటను దాదాపు ఆక్రమణల పాలు కావడంతో కుంటలో నీరు నిలిచేందుకే ఆస్కారం లేకుండా పోయింది. దీంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుంటను ఇకనైనా ఆక్రమణల బారి నుంచి బయట పడేయాలని రైతులు కోరుతున్నారు.




దిగువ ఇప్పకుంట కట్టపై అక్రమ ఇళ్ల నిర్మాణాలు

ట్రాఫిక్ సుడిగుండంలో నగరం



కార్వేటినగరంలో వరుసగా వెళుతున్న చెరుకు ట్రాక్టర్లు, ట్రాఫిక్‌కు వరిగడ్డి తరలించే వాహనాలు

కార్వేటినగరం: చెరుకు క్రషింగ్ ప్రారంభమైతే చాలు కార్వేటినగరం ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది. చెరుకు ట్రాక్టర్లు రాత్రనక, పగలనకా పరిమితికి మించిన లోడ్‌తో రావడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కనీసం పాదచారులు వెళ్లేందుకు వీల్లేని విధంగా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. శ్రీరంగరాజపురం మండలంలో ఉన్న ఎస్.ఎన్.జే షుగర్ ఫ్యాక్టరీకి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే చెరుకు ట్రాక్టర్ల వల్ల ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో లారీల ద్వారా చెరుకు తరలించడంతో అప్పట్లో ఇలాంటి సమస్యలు రాలేదన్న చర్చ జరుగుతోంది. వీటికి తోడు ఎండు గడ్డి తరలించే ట్రాక్టర్లు కొండలను తలపించే విధంగా అధిక లోడ్లతో రావడంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండడంతో బస్సు, కారు, అంబులెన్స్, అత్యవసరంగా వెళ్లాల్సిన వాహనాలతో పాటు జిల్లా స్థాయి అధికారులు ట్రాఫిక్ ఇబ్బందుల్లో చిక్కుకున్న రోజులు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించే మార్గం ఆలోచించాలని కోరుతున్నారు.

అధికారులూ.. స్పందించండి



ఇళ్లముందు నిల్వ ఉన్న మురుగు నీరు, మురుగు నీటికాల్వలో పేరుకున్న వ్యర్థాలు

- కడపగుంట దళితవాడలో డెంగీ జ్వరాలు
- వీధుల్లో పారుతున్న మురుగునీరు


డెంగీ జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు

గంగాధరనెల్లూరు: ప్రజల ప్రాణాలు గాల్లో కలసిపోకముందే అధికారులు స్పందించాలని కడపగుంట దళితవాడ ప్రజలు కోరుతున్నారు. మండలంలోని కడపగుంట దళితవాడలో పారిశుధ్యం లోపించింది. మురుగు నీటి కాలువలు వ్యర్థాలతో నిండి గ్రామం మురికి కూపంగా దర్శనమిస్తోంది. కనీసం బ్లీచింగ్ చల్లి పారిశుధ్యాన్ని మెరుగు పరచండని మొత్తుకుంటున్నా అధికారులు కనుచూపు మేరలో కనిపించక పోవడం విశేషం. దీంతో దోమలు వృద్ధి చెంది గ్రామంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. పదుల సంఖ్యలో డెంగీ జ్వరాలతో మంచానపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు ఆస్పత్రిలో మగ్గుతున్నారు. దుర్గంధభరితంగా మారిన దళితవాడలో విధి లేక ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని, ప్రాణ నష్టం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించిన ప్రణవ్‌సాయి

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో బృందావన్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి ప్రణవ్‌సాయి ప్రతిభ చాటి బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ నెల 17వ నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జాతీయ స్థాయి 68వ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. అండర్ 19 బాలుర బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ప్రణవ్‌సాయి రాజస్థాన్‌కు చెందిన విద్యార్థితో తలబడి తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఆ విద్యార్థిని బృందావన్ పాఠశాల చైర్మన్ శైలజ కుమారి, డైరెక్టర్ ప్రియతేజ, టీచర్లు అభినందించారు.

పనివేళల పెంపు నిర్ణయం సరికాదు


సభ్యత్వ నమోదులో ఎస్టీయూ నాయకులు

కార్వేటినగరం: పాఠశాలల పనివేళల పెంపు సరైన నిర్ణయం కాదని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమ చంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలను సేకరించారు. సభ్యత్వ నమోదులో భాగంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పు చేస్తూ సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగించాలన్న నిర్ణయాన్ని సంఘం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి యువరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పిల్లలు ఇంటికి చేరేసరికి చీకటి పడుతుందని, పిల్లల భద్రత గురించి ప్రభుత్వం ఆలోచించాలని, పనివేళల పెంపు వలన ప్రభుత్వ పాఠశాలలోని బాలికలు డ్రాపౌట్ అయ్యే అవకాశం ఉందన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ అదృశ్యం


పి.శరవణ

పుత్తూరు: మండలంలోని ఉత్తరపుకండ్రిగ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.శరవణ(25) ఈనెల 18వ తేదీ నుంచి కపించడంలేదని అతని తండ్రి నటరాజన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నటరాజన్ ఫిర్యాదు మేరకు.. గత సోమవారం డ్యూటీకి వెళ్లొస్తానని ఇంటి నుంచి వెళ్లిన శరవణ పొద్దుపోయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా సెల్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. మంగళవారం సచివాలయ కార్యదర్శి హరిబాబును విచారించగా సోమవారం డ్యూటీకి వచ్చిన శరవణ తనకు సెలవు కావాలని, చిత్తూరులోని ఎల్ఐసీ ఆఫీసుకు వెళ్లాలని చెప్పాడన్నారు. అయితే కార్యదర్శి మరోరోజు వెళ్లవచ్చని చెప్పడంతో బయోమెట్రిక్ వేసి పనికి ఉపక్రమించాడన్నారు. మధ్యాహ్నం 12 నుంచే శరవణ ఆఫీసులో కపించకపోవడంతో ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదన్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. మంగళవారం సైతం డ్యూటీకి రాకపోవడంతో కార్యదర్శి పుత్తూరు ఎంపీడీఓకు ఈమేరకు సమాచారం అందించారు. మూడు రోజులుగా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఈ మేరకు అతని తండ్రి నటరాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.